



దివ్యాంగ బాలలకు బంగారు భవిత

పిల్లల మనసు తెల్లకాగితం వంటిది. వారి పసిమనసులపై మనం జాగ్రత్తగా రాసే రాతలే వారి భవితను తీర్చిదిద్దుతాయి. సాధారణ పిల్లల విషయంలో కొద్దిపాటి జాగ్రత్తలతో వారిని చక్కగా మలచుకోవచ్చు. కానీ, మానసికంగా ఎదుగుదల లేని పిల్లల విషయంలో తల్లిదండ్రులకు ప్రతీరోజు ఒక పరీక్షలానే ఉంటుంది. ముఖ్యంగా వారు ఒంటరిగా ఉండలేక, తల్లిదండ్రులను ఎటూ కదలనివ్వరు. అలాంటి పిల్లలకు ఓ వరంలా నిలుస్తున్నాయి భవిత కేంద్రాలు. వారికి ప్రవర్తన నేర్పుతూ, ఆటపాటల్లోనూ ముందుండేలా ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతున్నాయి. తల్లిదండ్రులకు తమ పిల్లల భవితకు భరోసా కల్పిస్తున్నాయి.



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్

భీమునిపట్నం: ప్రత్యేక అవసరాలు గల బాలలకు వరంగా మారింది భీమిలిలోని భవిత కేంద్రం. వారికి దిక్సూచిలా మార్గం చూపుతూ.. బంగారు భవితకు భరోసాగా నిలుస్తోంది. పిల్లలను వ్యక్తిగత శ్రద్ధతో వారిని తీర్చిదిద్దుతున్న తీరు వారి తల్లిదండ్రుల బెంగను దూరం చేస్తోంది. గతంలో ఇటువంటి పిల్లలను వారు ఉండే ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదివించాల్సి వచ్చేది. వీరికోసం నియమించిన సిబ్బంది ఆయా పాఠశాలలకు వెళ్లి వారికి శిక్షణ ఇచ్చేవారు.

భవిత కేంద్రం ఏర్పాటు

ఇటువంటి పిల్లల కోసం ప్రత్యేకమైన భవిత కేంద్రాన్ని 2013లో భీమిలిలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రం నిర్వహణ జరుగుతోంది. కేంద్రంలోని పిల్లలను చూసుకునేందుకు ఇద్దరు టీచర్లు, ఒక ఆయా, ఒక కేర్‌టేకర్ ఉంటారు. ఇక్కడ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉండగా, ప్రస్తుతం 23మంది పిల్లలు ఉన్నారు. ఇందులో మగపిల్లలు 18మంది, ఆడపిల్లలు అయిదుగురు ఉన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు పాఠశాల నిర్వహణ ఉంటోంది.

ఇళ్లకు వెళ్లి పిల్లల ఎంపిక

ఈ కేంద్రంలో పిల్లలను చేర్చుకునేందుకు గాను సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, ఎంపిక చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి జూన్‌లో పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు అన్ని ప్రాంతాలకు వెళ్లి, పిల్లలను గుర్తించి ఈ కేంద్రంలో చేర్పిస్తున్నారు. భీమిలి, తగరపువలస పరిసరాలతో పాటు మండల పరిధిలోని కొన్ని గ్రామాల నుంచి కూడా పిల్లలు ఇక్కడికి వస్తున్నారు. ఇందులో కొందరు తల్లిదండ్రులు రోజూ స్వయంగా తమ పిల్లలను ఇక్కడకు తీసుకు వచ్చి తీసుకువెళ్తుండగా, కొందరు ఆటోను ఏర్పాటు చేయడంతో అందులో వచ్చి వెళ్తున్నారు. ఈ కేంద్రంలో చేరడానికి ప్రత్యేకంగా తేదీ ఏమీ లేదని, ఎవరైనా పిల్లలు ఉంటే ఎప్పుడైనా తీసుకువచ్చి చేర్పవచ్చని చెబుతున్నారు.



ఇళ్ల వద్దకు వెళ్లి పిల్లలను గుర్తించి నమోదు చేసుకుంటున్న ఎంఈవో శివరాణి, టీచర్లు

ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ

కేంద్రానికి వచ్చే పిల్లల విషయంలో సిబ్బంది ఎన్నో జాగ్ర**త్తలు తీసుకుని, వారిని పర్య**వేక్షిస్తున్నారు. వారిలో మానసిక **ఎదుగుదల సరిగ్గా లేకపో**వడంతో ఒక్కొక్కరు ఒక్కోలా ప్రవర్తిస్తుంటారు. దీంతో ముందుగా వారిని అలవాటు చేసుకుని, తమ మాట వినే విధంగా నెమ్మదిగా నచ్చచెబుతారు. తర్వాత రాయడం, పదాలు చదవడం నేర్పుతారు. మెల్లగా పాఠాలు బోధిస్తారు. ఇంకా.. బొమ్మలతో ఆడించడం, పజిల్స్ చేయించడం, చిత్రలేఖనం, నృత్యాలు, ఆటలు ఆడించడం చేస్తారు. వీరిలో ఎవరైనా ప్రవర్తనలో, చదువులో మెరుగుపడితే వారిని సాధారణ పాఠశాలల్లో చేర్పిస్తారు.

ప్రాథమిక పాఠశాలలో విలీనం

ఇక్కడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాన్ని అధికారులు 2024లో భీమిలి చిన్నబజారు సమీపంలోని రెల్లివీధి ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేశారు. దీంతో వీరికి ఇక్కడ ప్రత్యేకించి రెండు గదులను కేటాయించారు, అందులోని ఒకదాంట్లో పిల్లలు చదువుకుంటుండగా, మరో గదిని మధ్యాహ్న భోజనం పెట్టడానికి వినియోగిస్తున్నారు. ఇలా ఈ భవిత కేంద్రం ప్రత్యేక అవసరాల పిల్లలకు అన్ని విధాలా చక్కగా ఉపయోగపడుతోంది.



బాగా చూసుకుంటున్నారు

కేంద్రంలో పిల్లలను చాలా బాగా చూసుకుంటున్నారు. మా అబ్బాయి మదన్‌కు ఏడు సంవత్సరాలు. మూడో తరగతి చదువుతున్నాడు. రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ చేర్పించాం. ఇక్కడికి వచ్చిన తరువాత రాయడం, మాట్లాడడంతో పాటు ఆటలు బాగా ఆడుకుంటున్నాడు. దీంతో మాకు ఇంట్లో ఇబ్బంది ఉండడం లేదు.

– అక్కరమని రమణ, గొల్లల తాళ్లవలస

పిల్లల్లో ఎంతో మార్పు వస్తోంది

మా బాబు ఆర్యన్‌కు ఏడు సంవత్సరాలు. గతేడాది ఇక్కడ చేర్పించాను. రెండో తరగతి చదువుతున్నాడు. ఇళ్లల్లో ఒంటరిగా ఇటువంటి పిల్లలు ఉండలేరు, చాలా ఇబ్బంది పెడతారు. కానీ, ఇక్కడ చాలామందితో కలిసి ఉండడం వల్ల సరదాగా ఉండడంతో పాటు ప్రవర్తనలో కూడా మంచి మార్పు వస్తోంది.



– మొకర గౌతమి, భీమిలి



భవిత కేంద్రంలో పిల్లల చేత గేమ్స్ ఆడిస్తున్న టీచర్లు



అన్నం తింటున్న దివ్యాంగబాలలు

వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటున్నాం



ఇక్కడ ఉంటున్న పిల్లలలకు ఏదో ఒక ఇబ్బంది, సమస్య ఉంటుంది. అటువంటి వారిని ఇక్కడి టీచర్లు, సిబ్బంది చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నాం. ప్రతి ఒక్కరిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని వారి ప్రవర్తనలో మార్పులు తీసుకువస్తున్నాం. ఇలా చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. తల్లిదండ్రులు చాలా ఆనందపడుతున్నారు.

– కెజియా కుమారి, సీనియర్ టీచర్

క్లుప్తంగా

ర్యాగింగ్ విషసంస్కృతికి దూరంగా ఉండాలి

కొమ్మాది: విద్యాసంస్థల్లో విద్యార్థుల మధ్య స్నేహబంధాలు ఉండాలని గీతం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. వారి మధ్య పోటీ వాతావరణం ఉండాలని, ర్యాగింగ్ వంటి విషసంస్కృతికి దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ గీతంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధానికి నిర్దేశించే చట్టాలను విద్యార్థులకు వివరించారు.

నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు బుధవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ సాధారణ బదిలీలు చేపట్టవలసి ఉందని, ప్రభుత్వం వెంటనే దీనిపై చర్యలను తీసుకోవాలని కోరారు. జీవో నంబర్ 42ను రద్దు చేసి, ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రంపాలెంలో 41 అడుగుల గణేశ విగ్రహం

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో 41 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చంద్రంపాలెంలో బుధవారం ఆవిష్కరించారు. శివానంద ప్రియ గణనాథుడి పేరుతో ఇక్కడ 41 అడుగుల మట్టి గణపతిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మండపం నిర్మాణం, ఇతర పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతేడాది కూడా ఇదే స్థాయిలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహించారు.

గణపతి నవరాత్రులకు ఉత్సవ రాట



రాటకు పూజ చేస్తున్న కాలనీ పెద్దలు

మధురవాడ: వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు జీవీఎంసీ ఏడో వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలో పందిరి రాట వేశారు. గ్రామపెద్దలు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మట్టి గణపతినే పూజించి ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

బీచ్ రోడ్డులో షూటింగ్ సందడి



నటీనటులపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

కొమ్మాది: బీచ్‌రోడ్డు రుషికొండ, ఆర్‌కే బీచ్ ప్రాంతాల్లో బుధవారం షూటింగ్ సందడి నెలకొంది. అనీల్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న రాజాధిరాజ సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను బీచ్‌రోడ్డు ప్రాంతంలో చిత్రీకరించారు. హీరో, హీరోయిన్లు రుత్విక్, విశాఖ, నటి రోహిణిలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు.

సుత్తమ్మతల్లికి పుష్పాలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి బుధవారం త్రివర్ణ శోభితగా దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు బంతి, మల్లె, కనకాంబరం, తులసి, జాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

1బీతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

పద్మనాభం: అర్హత ఉండి అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు జమ కాని రైతులు 1బీతో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం తెలిపారు. రైతులు తమ రైతు సేవాకేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు వివరాలు అందజేయాలన్నారు. అనంతరం సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ల వద్దకు వెళ్లి 1బీతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటికి దివీస్ సహకారం


తగరపువలస: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ, ముంచంగిపుట్టు పరిధిలోని గ్రామాలకు తాగునీరు అందించేందుకు భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం ముందుకొచ్చింది. దీని కోసం రూ.4,19,500 చెక్కును నగరానికి చెందిన శారదా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తిరుపతిరావుకు బుధవారం కంపెనీ ప్రతినిధులు అందించారు. కిన్నంగూడ, బెడ్డగూడ గిరిజన గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు నిర్మించి గిరిజనుల దాహార్తిని తీర్చేందుకు శారదా ట్రస్ట్ తమను సంప్రదించినట్టు జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్సార్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



తిరుపతిరావుకు చెక్కు అందిస్తున్న దివీస్ జీఎం కోటేశ్వరరావు

హరేకృష్ణ వైకుంఠంలో 15 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

16న ఉట్టి సంబరం



శ్రీరాధా మదన్‌మోహనులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరం నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి అంబరీషదాస తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు చెప్పారు. 108 పలకలతో హరినామ జప మండపం ఏర్పాట్లు జరుగుతున్నందున, భక్తులు 108 మార్లు హరి నామజపం చేసి ప్రశాంతత పొందవచ్చన్నారు.

16న మహా అభిషేకం

16వ తేదీ కృష్ణాష్టమి రోజున రాత్రి 9.30 గంటలకు సప్తనదుల నుంచి సేకరించిన పవిత్రజలాలు, 108 పవిత్ర జల కలశాలు, పండ్లరసాలు, పంచగవ్యాలు, వివిధ రకాల పుష్పాలతో మహా అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే శ్రీకృష్ణుడు జన్మించిన రాత్రి 12 గంటల సమయంలో మహా మంగళ హారతి ఉంటుందన్నారు.

లడ్డూ గోపాలుడికి ఊయల సేవ

16 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సాయంత్రం 5 గంటల నుంచి 9 వరకు తిరిగి 17 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బృందావనం నుంచి వచ్చిన లడ్డూ గోపాలునికి ఊయల సేవ జరిపిస్తామన్నారు. 16,17 తేదీల్లో ఉత్తరాంధ్ర కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే రోజు భక్తుల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు ఉట్టి ఉత్సవం, కృష్ణుడితో సెల్ఫీ వంటి వేర్వేరు పరీక్షలు, పోటీలు నిర్వహించనున్నారు. చివరి రోజైన సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి 9 వరకు వ్యాస పూజ, నందోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమాలలో పాల్గొనాలనుకునే భక్తులు 95425 11108 నంబరులో సంప్రదించాలని అంబరీష దాస కోరారు.

ఇంటింటా జాతీయ జెండాలను ఎగరవేయాలి

- సెల్ఫీ అప్‌లోడ్‌తో డిజిటల్ సర్టిఫికెట్
- చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి
- వాడవాడలా ఉత్సాహంగా తిరంగా ర్యాలీలు



పద్మనాభంలో జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తగరపువలస: ఇంటింటా జాతీయ జెండాలను ఎగరవేసి సెల్ఫీలు తీసుకుని అప్‌లోడ్ చేసి, ప్రతి ఒక్కరూ డిజిటల్ సర్టిఫికెట్లు పొందాలని చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో జాతీయ జెండాలతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

- ఆనందపురం మండలం వేములవలసలో బీజేపీ నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు పిల్లా విజయ, దానేష్, చక్రవర్తి, దక్షిణామూర్తి, ఉప్పాడ అప్పారావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పద్మనాభంలో..

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీని తహసీల్దార్ కె.ఆనందరావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో రూపాకుల రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి, గోస్తని విద్యాపీఠ్, జెడ్పీ హైస్కూల్, కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

మారికవలసలో..

మధురవాడ: హర్ ఘర్ తిరంగా ర్యాలీని బీజేపీ నాయకులు మారికవలస పరిసర ప్రాంతాల్లో నిర్వహించారు. బైకులపై జాతీయ జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలి నిర్వహించారు.



వేములవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో ర్యాలీ

తీరంలో..

కొమ్మాది: బీచ్ రోడ్డు పరిధి సాగర్‌నగర్‌లో బుధవారం సాయంత్రం హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సాగర్‌నగర్ నుంచి కొమ్మాది వరకు ర్యాలీ సాగింది. బీజేపీ వార్డు అధ్యక్షులు గరికిన ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

తీరం వద్ద అపస్మారక స్థితిలో వ్యక్తి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ దరి తీరంలో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని పర్యాటకులు గుర్తించారు. బుధవారం సాయంత్రం 6 నుండి 7 గంటల మధ్యలో ఓ వ్యక్తి ఈ తీరం వద్ద పాయిజన్ తీసుకోవడం వలన అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇటుగా వచ్చిన పర్యాటకులు ఆ వ్యక్తిని గమనించి, వెంటనే 108 కు సమాచారం అందించడంతో, సిబ్బంది వచ్చి 108లో కేజీహెచ్‌కు తరలించారు. ఈయన వయసు సుమారు 55 సంవత్సరాలు ఉంటుందని ఆరిలోవ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఎవరనేది తెలియలేదన్నారు.



అపస్మారక స్థితిలో వ్యక్తి

భీమిలిలో కుండపోత



పద్మనాభం జంక్షన్‌లో రోడ్డుపై వర్షపు నీరు

తగరపువలస: చాలా రోజుల తరువాత భీమిలిని బుధవారం కుండపోత వర్షం పలకరించింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో వర్షం అరగంట పాటు తెరిపి లేకుండా కురవగా, తరువాత మరో అరగంట పాటు మళ్లీ వర్షం కుమ్మరించింది. దీంతో నాలుగు నెలలుగా ఉక్కపోత వాతావరణంతో అల్లాడుతున్న ప్రజలు సేదతీరారు. ఈ వర్షం రైతుల ఆశలను చిగురింపచేసినట్టయింది. యథావిధిగా డ్రైనేజీలు పొంగిపొర్లాయి. డ్రైనేజీలు లేని చోట్ల రహదారులు చెరువులను తలపించాయి.

పద్మనాభంలో ..

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవా రం ఉదయం వర్షం కురిసింది. కృష్ణాపురం, మద్ది, రెడ్డిపల్లి, పద్మనాభం, కురపల్లి, కోరాడ, గెడ్డపేట తదితర గ్రామాల్లో జడివాన కురిసింది. పద్మనాభం, మద్ది జంక్షన్లలో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- 15కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- అసలే వర్షాభావం.. ఆపై అందని విద్యుత్
- సాగని సాగు



కోర్ కాజేసి బాక్సులు వదిలేసిన దుండగులు



వర్షాలు లేక కొర్నీ వదిలేసిన పంటభూమి

తగరపువలస: ఒకవైపు కన్నెర్ర చేసిన ప్రకృతి.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంలా మారాయి. ఆగస్ట్ నెల వచ్చినా వర్షాలు లేక, ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవడంతో విద్యుత్ సరఫరా లేక సాగు ముందుకు సాగడం లేదు. ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిలో సాగు భూములకు సరఫరా అయ్యే విద్యుత్ లైన్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు ఏడాదిగా వరుస చోరీలకు గురవుతున్నాయి. దీంతో పక్కనే సాగు కాలువలున్నా గంటకు లీటర్ డీజిల్‌కు రూ.110 వెచ్చించి వ్యవసాయం చేయలేమని రైతులు చేతులు ఎత్తేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురై నెలలు గడుస్తున్నా ఫిర్యాదు అందుకున్న పోలీసులు గాని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవలసిన విద్యుత్ శాఖ గాని స్పందించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

అందని 'అన్నదాత సుఖీభవ'

ఇటీవల కూటమి ప్రభుత్వం పాక్షికంగా చెల్లించిన అన్నదాత సుఖీభవ సాయం కూడా ఇక్కడి రైతులకు అందలేదు. దీంతో రైతులు కరువు కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నారు. ఒకవైపు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే, భీమిలిలో కూటమి నాయకులు రైతు సంబరాలు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. సాఫీగా సాగవలసిన రైతుల జీవితాలు ఒడిదుడుకులకు లోనవుతున్నా సరిచేయవలసిన వ్యవసాయ, విద్యుత్, పోలీసుశాఖలు పట్టనట్టుగా వ్యవహరించడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది.

- ఆనందపురం మండలం బోని పంచాయతీ పరిధిలో రైతులకు పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పరిధిలోని ఏనుగులపాలెం రహదారిలో చిరతగట్టు కాలువను ఆనుకుని పంటపొలాలు ఉన్నాయి. గతంలో ఇటుక బట్టీల వేడి కారణంగా సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో వైఎస్సార్‌సీపీ భీమిలి ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు చొరవతో గత నెల 7వ తేదీన పునరుద్ధరించారు. ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణతో చుట్టుపక్కల రైతులు వెంటనే వరి నారు వేశారు. ఇది జరిగిన వారం రోజుల్లో బోని, పాండ్రంగి పంచాయతీలలో సుమారు 15కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. స్తంభాల నుంచి వేరు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి అవసరమైన కాపర్ తీసుకుని మిగిలినవి అక్కడే పడేశారు. ఈ సంఘటనలపై స్థానిక రైతులు గత నెల 15న ఆనందపురం పోలీసులకు, విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఒకసారి స్పందించినా విద్యుత్ శాఖ ఏఈ పట్టించుకోకపోవడంతో ఇప్పటికి ఆయన వద్దకు నాలుగు సార్లు, మధురవాడ డీఈఈ వద్దకు ఒకసారి వెళ్లారు. రూ.10వేలు వంతున నారు వేయడానికి ఖర్చు చేసిన రైతులు నీరు లేక కలుపు తీయడం గాని, దమ్ము పట్టడం గాని చేకుండా కొర్నీ భూముల వైపు దిగులుగా చూస్తున్నారు.



బోని ఏనుగుల పాలెం రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ తొలగించిన స్తంభం

తడి లేక 83 సెంట్ల భూమిని అలాగే వదిలేశాం



నారు వేసిన 21 రోజుల తరువాత ఉడుపులకు పనికి వస్తుంది. 40 రోజులు అవుతున్నా విద్యుత్ సరఫరా, వర్షం గాని లేకపోవడంతో 83 సెంట్ల భూమిని అలాగే వదిలేశాం. కమర్షియల్ ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించిన విద్యుత్‌శాఖ రైతులకు మాత్రం మొండి చేయి చూపించింది. తడి లేక నారు తీద్దామన్నా తెగిపోతుంది.

–కప్పల శ్రీనివాసరావు, ఏనుగులపాలెం

రూ.10వేలు డీజిల్‌కే..



నారుమడిని బతికించుకోవడానికి గంటకు లీటర్ డీజిల్‌కు రూ.110 ఖర్చు చేయాలి. ఎకరా పొలానికి దమ్ము పెట్టాలంటే చిరతగట్టు కాలువ నుంచి ఏకంగా మూడు రోజులు పగలురాత్రి నీరుతోడినా రూ.7వేలు ఖర్చు అవుతుంది. వారానికి రెండు సార్లు నీరు పెట్టాలన్నా రూ.5వేలు వంతున రూ.10వేలు డీజిల్‌కే ఖర్చు అవుతుంది.

– పసుపురెడ్డి వీరబాబు, పాండ్రంగి

గౌరమ్మ ప్రతిరూపానికి పూజలు

తగరపువలస: గ్రామీణ ప్రాంతాల్లో వరినాట్లు మొదలయ్యే వేళ గౌరమ్మ పేరిట అక్కడి మహిళలు పూజలు చేస్తుంటారు. నాట్లు ప్రారంభానికి ముందు కట్టలు కట్టి, పూజలు చేయడం ఆనవాయితీ. ఆనందపురం మండలం గొట్టిపల్లిలో మహిళలు బుధవారం ఈ విధంగా పూజలు చేసి గౌరమ్మ ఆశీర్వాదాలు తీసుకోవాలని పలువురిని కోరారు. వారు ఇచ్చిన కానుకలు స్వీకరించారు. వీటిని వ్యవసాయ కూలీలు పంచుకుంటారు. ఇదే నారు ఎదిగి పొట్టదశలో ఉన్నప్పుడు దీపావళి మొదలుకుని అయిదు రోజుల పాటు పూజించి గౌరమ్మ ప్రతిరూపమైన వరిదుబ్బులకు పూజ చేసి, నాగుల చవితి రోజు అనుపోత్సవం నిర్వహిస్తుంటారు.